క్లుప్తంగా

సమయపాలన తప్పనిసరి



డ్రగ్ స్టోర్‌ను పరిశీలిస్తున్న తాడేల శ్రీకాంత్

నరసన్నపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని అదనపు డీఎంహెచ్‌ఓ తాడేల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుతోపాటు డ్రగ్ స్టోర్‌ను పరిశీలించారు. మందుల కొరత ఉందా అని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేదని సిబ్బంది తెలిపారు. ఎల్సీడీసీ సర్వే ఎలా జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన కుష్టు వ్యాధిగ్రస్తులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ వారు జలుమూరులో నిర్వహిస్తున్నారని, అర్హులైన వారు ఉంటే పంపాలని సూచించారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, మాకివలస వైద్యాధికారి విజయకుమార్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు: స్థానిక మండల న్యాయ సేవా సంఘంలో పారా లీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు ఈ నెల 31వ తేదీలోగా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.మణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, న్యాయ విద్యార్థులు, మైత్రీ సంఘం సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రాజకీయేతరులు అర్హులన్నారు. కొత్తూరు, హిరమండలం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని భామిని మండలాలకు చెందినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఎటువంటి జీతభత్యాలు, వేతనాలు ఉండవన్నారు. కేవలం సేవాభావంతో పని చేయాలని స్పష్టం చేశారు.

ఉల్లాస్‌ను విజయవంతం చేయండి



ఉల్లాస్ బుక్‌ను చూపుతున్న వలంటీర్లు

నరసన్నపేట: నిరక్షరాస్యులైన వారికి అక్షరాస్యులుగా తీరిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన 'ఉల్లాస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ మధుసూదనరావు కోరారు. మండలంలో 1366 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి అక్ష్యరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 137 మంది వలంటీర్లను నియమించామన్నారు. వీరందరికీ సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. వలంటీర్లకు అప్పగించిన బాధ్యతలను పూర్తిచేయాలన్నారు. నిర్దేశించిన తేదీ నాటికి నిరక్షరాస్యులతో సంతకం చేయడం నేర్పించాలన్నారు. ఏపీఎం అప్పలరామయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



బీసీ కాలనీ వద్ద కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

కొత్తూరు: మండలం కేంద్రంలోని బీసీ కాలనీ, రెల్లి వీధిలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువలను సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ

కొత్తూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ సూచించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సోమవారం తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని 46 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేసి బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. హెల్మెట్ తీసుకువచ్చినవారికి బైక్ అప్పగించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉండాలన్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్‌ఏ-3 పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంఈఓ రాంబాబు తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో పరీక్ష ప్రశ్న పత్రాలను ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా సిబ్బందితో సర్దుబాటుచేయించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు ఉంటాయన్నారు. హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

దివ్యాంగులకు.. అష్టకష్టాలు!



పాతపట్నం: పాతపట్నం సీహెచ్‌సీలో వైద్యుల కోసం నిరీక్షిస్తున్న దివ్యాంగులు

- పాతపట్నం, నరసన్నపేటల్లో సదరం క్యాంప్‌లు
- గంటల కొద్దీ నిరీక్షణ
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

పాతపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే పింఛన్లను కుదించడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా దివ్యాంగ నిర్ధారణ పరీక్షలు చేయాలని నిర్ణయించింది. ముందస్తు ప్రణాళిక లేకుండా హడావిడిగా సదరం క్యాంపులు ఏర్పాటు చేస్తుండడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇంటినుంచి సదరం క్యాంప్‌లకు 28 నుంచి 30 కిలో మీటర్ల దూరం ఉండడంతో వ్యయ ప్రయాసలకు లోనయ్యారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉన్నఫలంగా హాజరుకావాలని సచివాలయ ఉద్యోగుల నుంచి సమాచారం రావడంతో అవస్థలు పడుతున్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో సోమవారం సదరం క్యాంప్ నిర్వహించారు. మూడు రోజులపాటు సదరం క్యాంప్ ఉంటుందని వైద్యులు తెలిపారు. కొత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆర్థోపెడిక్ వచ్చి దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కొత్తూరు మండలంలోని బలద, దిమిలి గ్రామ సచివాలయాలకు సంబంధించినవారు వైద్య పరీక్షలకు హాజరయ్యారు. పాతపట్నం సీహెచ్‌సీకి ఉదయం 9 గంటలకు రావాలని చెప్పడంతో సమయానికి చేరుకున్నారు. శ్రీకాకుళం నుంచి కొంతమంది వైద్యులు ఉదయం 11 గంటలకు హాజరయ్యారు. తొలిరోజు ఎముకలకు సంబంధించిన వైద్య పరీక్షలే చేశారు. సదరం క్యాంప్‌కు దిమిలి, కొసల్యాపురం, సంగన్నగూడ నుంచి బుద్ధిమాంద్యం పిల్లలతో తల్లిదండ్రులు చేరుకున్నారు. అధికారులు సరైన సమాచారం అందించలేదని, అవస్థలు పడుతూ వెనుదిరిగారు.



పాతపట్నం: తండ్రితో కె.మనోహార్ (బుద్ధిమాంద్యం) కొసల్యపురం, కొత్తూరు మండలం

ఇవేం బాధలు..

నరసన్నపేట: మండలంలో 497 దివ్యాంగ పింఛన్లు ఉండగా.. వాటిని ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు సోమవారం తనిఖీ చేయడం ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్‌గా పనిచేస్తున్న రెడ్డి చిన్నంనాయుడు వచ్చి 50 మందిని తనిఖీలు చేశారు. గతంలో పొందిన సర్టిఫికెట్లకు ప్రస్తుతం ఉన్న వైకల్యాన్ని పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. తనిఖీలు పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు.

తప్పనిసరిగా హాజరుకావాలి..

దివ్యాంగ పింఛన్ పొందుతున్నవారు విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని, హాజరుకాకపోతే వచ్చే నెల పింఛన్‌రాదని వైద్యుడు చిన్నంనాయుడు తెలిపారు. వెరిఫికేషన్‌కు వచ్చేవారు విధిగా ఒరిజినల్ సర్టిఫికెట్లు, అంగ వైకల్యానికి సంబంధించి పూర్తి వివరాలతో హాజరుకావాలని కోరారు.

దివ్యాంగుల అవస్థలు..

పింఛన్ పొందుతున్న దివ్యాంగులు సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ కోసం రావడానికి అవస్థలు పడ్డారు. వివిధ గ్రామాల నుంచి ఇబ్బంది పడి వచ్చారు. ఇవేం బాధలని ఆవేదన చెందారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు చిన్నంనాయుడు



వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగుడు

ఎన్నో ఇబ్బందులు పడి వచ్చాం..



కొత్తూరు మండలం దిమిలి సచివాలయ పరిధిలోని సంగన్నగూడలో ఉంటున్నాం. మా పాప బొడ్డగోడు లలితకు బుద్ధిమాంద్యం ఉంది. అధికారులు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని తెలియజేయడంతో ఉదయం ఆటోలో 30 కిలో మీటర్లు దూరం నుంచి తీసుకువచ్చాను. ఇక్కడకు వస్తే మా పాపకు వైద్య పరీక్షలు ఈ రోజు కాదని చెప్పడంతో ఇంటికి వెళ్లిపోతున్నాం. ప్రభుత్వం మాలాంటి పేదలకు మినహాయింపు ఇచ్చి న్యాయం చేయాలి.

– బొడ్డగోడు రత్నాలు, బుద్ధిమాంద్యం బాలిక తల్లి, సంగన్నగూడ, కొత్తూరు మండలం

సూపర్ సిక్స్ హామీలు గాలికి..

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఆరోపించారు. మండలంలోని రొట్టవలసలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సామాన్యుడు రాజకీయంగా ఎదిగితే కొంతమంది సహించలేకపోతున్నారన్నారు. మీ గ్రామంలో ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి వచ్చి నా ఇంటి తలుపుతట్టవచ్చన్నారు. మీ కష్టాల్లో కుటుంబ సభ్యుడిగా భావించి మీతో కలిసి ఉంటానన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల తనిఖీల పేరుతో వివక్ష చూపించి రద్దు చేస్తున్నారన్నారు. పింఛన్లు, ఉద్యోగాలు తొలగించినవారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గిరిపుత్రుల మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్న..థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో పోరాటాలు చేద్దామన్నారు. పేదవాడు తలెత్తుకొని గౌరవంగా బతకాలంటే మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ అనిల్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, అత్తులూరి రవికాంత్, బద్రి రామారావు, పున్నపురెడ్డి తవిటినాయుడు, రొట్టవలస సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ, కుసుమంచి హరీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- డిప్యూటీ ఈఓ విజయకుమారి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

నరసన్నపేట: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్ల అనుమతులు రద్దు చేస్తామని డిప్యూటీ ఈఓ విజయకుమారి హెచ్చరించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో ఉన్న ప్రైవేట్ స్కూళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. విధిగా ప్రతిఒక్కరూ రెన్యువల్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సర్క్యులర్స్‌కు ఎప్పటికప్పుడు సమాధానాలు ఇవ్వాలన్నారు. చాలామంది పట్టించుకోవడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సెలవు రోజుల్లో స్కూళ్లు తెరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓ దాలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులందరికీ ఉపాధి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలకు వంద రోజులు లక్ష్యంగా ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి నెలాఖరునాటికి వంద రోజులు పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అన్ని గ్రామాల్లోను ఉపాధి హామీ పనులు జరగాలన్నారు. దినసరి వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనులు చేయించాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి ఉన్నారు.

వితరణ..



సారవకోట మండలంలోని గోవర్ధనపురంలో నిర్మిస్తున్న నవగ్రహ ఆలయ నిర్మాణానికి పాతపట్నం రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పారశెల్లి రామరాజు రూ.25 వేలను సోమవారం కమిటీ ప్రతినిధులకు అందించారు. గ్రామస్తులు నిధులు సేకరించి నవగ్రహ ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఆలయ నిర్మాణ విషయాన్ని రామరాజు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడంతో ట్రస్టు తరఫున ఆర్థిక సహాయం అందించారు.

- సారవకోట

వైద్య పరీక్షలు..



మెళియాపుట్టి మండలంలోని రాజపురంలో చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పావని ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 80 మంది వృద్ధులు మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కీళ్ల నొప్పులకు సంబంధించిన మందులను పంపిణీ చేసి, ఆరోగ్య పరీక్షల నిమిత్తం పీహెచ్‌సీకి రావాలని తెలిపారు. గ్రామస్తులు భాస్కర్ గౌడ్, గ్రానైట్ క్వారీ ఓనర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

- మెళియాపుట్టి


ఆర్థికసాయం..



కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–1990లో పదో తరగతి చదువుకున్న మండపాక రాజ్‌కుమార్ కుటుంబానికి రూ.30,500లను తోటి విద్యార్థులు సోమవారం విశాఖపట్నం వెళ్లి అందజేశారు. రాజ్‌కుమార్ ఈ నెల 16 తేదీన గుండెపోటుతో మృతి చెందారు. పూర్వ విద్యార్థులందరూ విరాళాలు సేకరించారు. పూర్వ విద్యార్థులు డిర్రి చిన్నారావు, గొల్లపల్లి అశోక్ బాబు, పురుషోత్తం, జగన్, తదితరులున్నారు.

- కొత్తూరు

ఆహ్లాదం..



ఈ చిత్రం కొత్తూరులో నిర్మించిన చెత్త సంపద కేంద్రం భవనానికి వెళ్లే ముఖద్వారం. చెత్త సంపద కేంద్రం పరిసరాలు పూల మొక్కలతో ఆహ్లాదకరంగా కనిస్తున్నాయి. ఈ రహదారిలో వెళ్లేవారు కొంతసమయం సేదతీరుతున్నారు.

- కొత్తూరు

65 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి కంటి పరీక్షలు చేశారు. 15 మందిని ఆపరేషన్లకు, 21 మందిని కళ్లద్దాల కోసం ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యనిపుణుడు కె.సురేష్, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్విని, ఆప్తాల్మిక్ అధికారి డి.ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.36 లక్షలతో సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, ఎంపీడీఓ టి.చంద్రకుమారి, హెచ్‌ఎం బి.రామ్మూర్తి, పైల బాబ్జి, సైలాడ సతీష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన పోలుమహంతి ప్రసాదరావు



హుండీని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

మెళియాపుట్టి: మండలంలోని గోపీనాథపురం గ్రామంలో హుండీ చోరీకి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సారవకోట మండలానికి చెందిన పోలు మహంతి ప్రసాదరావు అనే వ్యక్తి మెళియాపుట్టి మండలం గోపీనాథపురం ముత్యాలపోలమ్మ ఆలయం హుండీని సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇనుపరాడ్డుతో పగలగొట్టడానికి ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై ఎస్‌ఐ రమేష్ బాబు కేసు నమోదు చేశారు. ఇదివరకు జరిగిన ఆలయాల చోరీ ఘటనల్లో ఇతని హస్త ఉందేమో అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా

ఆమదాలవలస: ఈ నెల 28వ నుంచి 31వ తేదీ వరకు రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా చేస్తామని పురపాలక సంఘం కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘానికి మంచినీటిని సరఫరా చేసే అలమాజీపేట హెడ్ వాటర్ మరమ్మతులు నిర్వహించామన్నారు. వంశధార నదిలో ఇసుక మేటలు ఏర్పడి బావులకు నీరు అందకపోవడంతో మరమ్మతులు చేపడతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పట్టుశాలీ సంక్షేమ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పొందూరు: మండలంలోని పట్టుశాలీ సామాజిక వర్గ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పట్టుశాలీ కల్యాణ మండపంలో పెద్దల సమక్షంలో జరిగిన ఎన్నికలో పూంద్రు రామకృష్ణను అధ్యక్షుడిగా, పాలిశెట్టి సూర్యంను ప్రధాన కార్యదర్శిగా, కోరుకొండ రాజశేఖర్‌ను ఉపాధ్యక్షుడిగా, మాడుగుల రామకృష్ణను సహాయ కార్యదర్శిగా, బండారు గణేష్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు.

వంజంగి సర్పంచ్ మృతి



సత్యవతి (ఫైల్)

ఆమదాలవలస: ఆమదాలవలస జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెండి గోవిందరావు సతీమణి, వంజంగి గ్రామ సర్పంచ్ సత్యవతి (51) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సంతాపం తెలియజేశారు. సర్పంచ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

పొందూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ వైద్యాధికారి కె.దివ్య పేర్కొన్నారు. మండలంలోని రాపాక గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. లేగ దూడలకు నట్టల నివారణ మందు, గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. పాడి రైతులు, పశువైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవా.. నమోస్తుతే..

సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వక్తలు అన్నారు. ఫిబ్రవరి నాలుగో తేదీన రథసప్తమిని రాష్ట్ర పండుగగా నిర్వహించనున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం సూర్య నమస్కారాల కార్యక్రమాలను నిర్వహించారు. సూర్య నమస్కారాలతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధికారులు సూర్య నమస్కారాలు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



సారవకోట: నవతేజ పాఠశాలలో సూర్య నమస్కారాలు వేస్తున్న విద్యార్థులు



పాతపట్నం: సూర్యనమస్కారాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



జలుమూరు: బాలుర ఉన్నత పాఠశాలలో సూర్య నమస్కారాలు నిర్వహిస్తున్న విద్యార్థులు



కొత్తూరు: పాతపొనుటూరు యూపీ పాఠశాలలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



కొత్తూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు